

జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ
డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
వీక్షించండి
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి వాటిని జాతీయ వార్త తెలుగు దినపత్రికలో ప్రచురిస్తాం.. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.
ఎడిటర్: చౌదరి, 9963063761



బుధవారం | 23-09-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 790 పేజీలు: 4 వెల : రూ.7







# క్షణక్షణం.. అర్నాబ్..
# భయం భయం

- జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వాన
- జిల్లాలో సరాసరి వర్షపాతం 66.8 మి.మీ
- నదుల్లోకి పెరుగుతున్న వరద
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- సముద్రంలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న అలలు
- బుధవారం అర్ధరాత్రి విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరం దాటే అవకాశం
- కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు
- విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్‌లు
- మత్స్యకారులు వేటకు వెళ్లకుండా తీర గ్రామాల్లో అవగాహన
- నేడు విద్యాసంస్థలకు సెలవు



శ్రీకాకుళం, సెప్టెంబర్ 22 (వార్త): బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర వాయుగుండం మారడంతో సోమవారం రాత్రి నుంచి శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా వాన కురుస్తోంది. ఈ తీవ్ర వాయుగుండం ప్రస్తుతానికి గోపాల్‌పూర్‌కు 150 కి.మీ, కళింగపట్నానికి 140 కి.మీ, ఒడిశాలోని పూరీకి 210 కి.మీ, విశాఖపట్నానికి 220 కి.మీ దూరంలో కేంద్రీకృతమైంది. బుధవారం అర్ధరాత్రి విశాఖపట్నం-గోపాల్‌పూర్ మధ్య తీరాలను దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బుధ, గురువారాలు ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. శ్రీకాకుళం జిల్లాలో సగటున 66.8 మి.మీ వర్షపాతం నమోదైంది. పలాసలో అత్యధికంగా 112.6 మి.మీ.. అత్యల్పంగా సారవకోటలో 31.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో కురుస్తున్న వర్షాల దృష్ట్యా ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటి ప్రవాహాల ఆధారంగా జిల్లాలోని ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టుల వద్ద అధికారులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. తోటపల్లి ప్రాజెక్టుకి ఎగువ నుంచి వచ్చే ప్రవాహాల ఆధారంగా బుధవారానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి, గురువారం నాటికి రెండవ ప్రమాద హెచ్చరిక స్థాయికి నీటి మట్టం చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే నాగావళి ప్రవాహాల ఆధారంగా నారాయణపురం ఆనకట్ట వద్ద బుధవారం సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి, అలాగే గురువారం నాటికి రెండవ, మూడవ ప్రమాద హెచ్చరిక స్థాయిలకు నీటి మట్టాలు పెరిగే అవకాశం ఉన్నట్లు కలెక్టర్ తెలియజేశారు. మంగళవారం రాత్రి 9 గంటలకు వంశధారకు వరద రావడంతో గొట్టాబ్యారేజీ వద్ద 20 గేట్లు ఎత్తి దిగువకు నీరు విడిచిపెట్టారు

### విద్యాసంస్థలకు సెలవు

జిల్లాలో బుధవారం భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని ప్రభుత్వ ప్రైవేట్ యాజమాన్యాల లోని అన్ని రకాల విద్యాసంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ తెలియజేశారు. అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ డిగ్రీ కళాశాలలు, అంబేద్కర్ యూనివర్సిటీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలు మొదలగు అన్ని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలలోని అన్నిరకాల విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

### నగరం.. జలమయం..

శ్రీకాకుళంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎప్పటిలాగే శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ముంపునకు గురైంది. దీంతో ప్రయాణికులు అవస్థలకు గురయ్యారు. నగరంలోని డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. మురుగునీరు రోడ్డెక్కడంతో పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

### జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు

శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా పోలీసు కార్యాలయంలో డయల్-112, 6309990933 కంట్రోల్ రూమ్‌లతో పాటు, జిల్లాలోని మూడు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలో ఆయా కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం డీఎస్పీ 6309990804,కాశీబుగ్గ డీఎస్పీ 6309990805, టెక్కలి డీఎస్పీ 6309990811, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ 6309990911 నంబర్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తో పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.జిల్లాలోని ప్రజలు అత్యవసర పరిస్థితులు, సహాయం అవసరమైన సందర్భాల్లో డయల్-112 లేదా పై కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రజల భద్రతకు పోలీసు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

### విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు

బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కారణంగా ఏర్పడిన అల్పపీడన ద్రోణి క్రమంగా తుఫానుగా రూపాంతరం చెందుతుందని ఎపిఈపిడిసిఎల్ ఎస్ఈ జిఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ నెల 26 వరకు జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయన్నారు. ఈదురు గాలులు ప్రభావం ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ ఇదివరకే ప్రకటన జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇది విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయానికి కారణం కావచ్చునని, ఈ కారణంగా ప్రత్యేక పర్యవేక్షణ కొరకు ఇప్పటికే జిల్లాలో విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయాల్లో (శ్రీకాకుళం డివిజన్ 9490610010, టెక్కలి డివిజన్ 9490610050, పలాస డివిజన్ - 9490612676) హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సరఫరాలో



లోపాలు లేదా ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు లేదా విద్యుత్ వైర్లు వేలాడిన లేదా పడిపోయినా హెల్ప్ డెస్క్‌లకు సంప్రదించాలని కోరారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలలో భాగంగా ఇప్పటికే 255 మంది వర్క్ మెన్, సిబ్బంది సామాగ్రి తరలించుటకు 15 వరకు వెహికల్స్, క్రేన్స్ - 13, పోల్ డ్రిల్లింగ్ మెషీన్స్ - 9, చెట్లు తొలగించుటకు పవర్ సాస్ 30, విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్స్ - 350, విద్యుత్ స్తంభాలు సుమారుగా 700 వరకు తీరప్రాంత మండలాలలో సిద్ధం చేయుట జరిగిందన్నారు. 1083 సెల్ టవర్స్ వద్ద జనరేటర్ను ఏర్పాటు చేయమని సంబందిత అధికారులకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

### తీరప్రాంత గ్రామాల్లో కలెక్టర్ పర్యటన

తీవ్ర వాయుగుండం ముప్పు, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో మంగళవారం రణస్థలం మండలంలోని తీరప్రాంత గ్రామాలైన జీరుపాలెం, అల్లివలస, కొవ్వాడ మత్స్యలేశంలలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి స్వయంగా పర్యటించారు. తీరప్రాంతాల్లో సముద్ర పరిస్థితి, గాలుల తీవ్రతను పర్యవేక్షించిన కలెక్టర్, గ్రామాల్లోని లోతట్టు, ముంపు ప్రాంతాలను పరిశీలించారు. అత్యవసర సమయంలో తీరప్రాంత ప్రజలను, మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చేపడుతున్న ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వర్షాలు, ఈదురుగాలుల వలన ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పునరావాస కేంద్రాలు, తాగునీరు, ఆహార సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. సముద్రం తీవ్ర అలజడిగా ఉన్నందున మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని, స్థానిక ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట ప్రత్యేక అధికారి సుగుణాకర్, రణస్థలం తహసీల్దార్ ఎస్. కిరణ్ కుమార్, ఎంపీడీఓ ఎమ్. ఈశ్వరరావు, జేఆర్ పూరం సీఐ అవతారం, ఎస్ఐ సత్యనారాయణ, ఇతర స్థానిక రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### సాధారణ స్థితి వచ్చే వరకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి: మంత్రి అచ్చెన్న

వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ఇంటి నుంచి బయటకు రావొద్దని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి తుఫాన్ ప్రభావం పై సమీక్షిస్తున్నారు.వాయుగుండం ప్రభావంపై జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదుల్లో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రజలు, పశువుల కాపరులు నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకూడదని, వరద నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని కోరారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్నారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు తమ పరిస్థితిని వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేసి, అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు.అత్యవసర పరిస్థితులకు సంబంధించి సమాచారం లేదా సహాయం అవసరమైన ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని మంత్రి సూచించారు. వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండండి: కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సూచించారు. జిల్లాలో వర్షాలు, వరదల పరిస్థితిపై మంగళవారం డిల్లీ నుండి శ్రీకాకుళం కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు మాట్లాడి వివరాలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖల అధికారులు పూర్తి అప్రమత్తతతో ఉండాలని మంత్రి సూచించారు. వినాయక చవితి నిమజ్జనాల్లో సైతం అత్యంత అప్రమత్తత అవసరమని ప్రజలకు సూచించారు. తీరప్రాంత గ్రామాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయడంతో పాటు, నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట్ల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను సైతం సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందస్తు సన్నద్ధత, అప్రమత్తతతో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు.




## వినాయక నిమజ్జనంలో
# విషాదం

- సముద్రంలో గల్లంతై వ్యక్తి మృతి
- ట్రాక్టర్ ఢీకొని ఓ విద్యార్థిని దుర్మరణం

పలాస, సెప్టెంబర్22 (వార్త): వినాయక నిమజ్జన వేడుకల్లో విషాదం చోటుచేసుకుంది. వజ్రపుకొత్తూరు మండలం దోకులపాడు సముద్ర తీరంలో వినాయక విగ్రహ నిమజ్జనం అనంతరం తిరిగి ఒడ్డుకు వస్తున్న సమయంలో అలల ఉధృతికి ఓ వ్యక్తి సముద్రంలో గల్లంతై మృతి చెందాడు. దోకులపాడుకు చెందిన దుమ్ము కూర్మారావు (45) మృతి చెందినట్లు వజ్రపుకొత్తూరు ఎస్సై నిహార్ తెలిపారు. దోకులపాడులో వినాయక నవరాత్రి ఉత్సవాల అనంతరం సోమవారం అర్ధరాత్రి సముద్రంలో విగ్రహ నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. నిమజ్జనం పూర్తయిన అనంతరం కూర్మారావు ఇతరులతో కలిసి సముద్రం నుంచి ఒడ్డుకు వస్తుండగా అలల ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. పెద్ద అల





తాకిడికి కూర్మారావు కొట్టుకుపోయాడు. స్థానిక మత్స్యకారులు వెంటనే సముద్రంలో గాలింపు చేపట్టారు. కొంతసేపటి తర్వాత కూర్మారావు మృతదేహాన్ని గుర్తించి ఒడ్డుకు తీసుకొచ్చారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు వజ్రపుకొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రోడ్డు ప్రమాదంలో పదేళ్ల బాలిక మృతి

పాతపట్నం, సెప్టెంబర్ 22 (వార్త): వినాయక నిమజ్జన ఊరేగింపులో సంభవించిన ప్రమాదంలో పదేళ్ల బాలిక మృతి చెందింది. ఈ విషాద సంఘటన పాతపట్నం మండలం రొమదల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రొంపివలస గ్రామానికి చెందిన టూట యేసులు మనుమరాలు కలాగతి లోవ్లీ (10) అనే మూడో తరగతి విద్యార్థిని ఈనెల 21న రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో గ్రామంలోని స్థానిక చెరువు సమీపంలో జరుగుతున్న వినాయక నిమజ్జన ఊరేగింపునకు వెళ్ళింది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన పిట్ట నారాయణ అనే వ్యక్తి నడుపుతున్న ట్రాక్టర్ ట్రాలర్ పైకి బాలిక ఎక్కింది. మొదట పనుకు అప్పలరాజు అనే వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో అప్పలరాజు కుడి కాలికి గాయమైంది. వెంటనే డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక ట్రాలీపై కూర్చున్న లోవ్లీ ట్రాక్టర్ వెనుక భాగన పడిపోయింది. ఈ విషయాన్ని గమనించని డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనుకకు తీయడంతో, వాహన వెనుక చక్రం బాలిక శరీరంపై నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన బాలికను గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా బాలిక మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. బాధిత బాలిక తాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె మధుసూదనరావు తెలిపారు. తండ్రి ఇటీవలే మరణించడం, తల్లి ఉపాధి పనుల కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. లోవ్లీ తన సోదరుడితో కలిసి రొంపివలసలోని తాతగారి ఇంటి వద్ద ఉండి చదువుకుంటుంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

## సముద్ర పరిస్థితులు అనుకూలించే వరకు వేటకు వెళ్లొద్దు : ఎమ్మెల్యే గౌతు శిరీష

### - పూడిలంక, మంచినీళ్లపేట, హుకుంపేటలో తీరప్రాంత పరిస్థితుల పరిశీలన



**పలాస, సెప్టెంబరు 22 (వార్త):** తుఫాన్ ప్రభావం నేపథ్యంలో తీరప్రాంతాల్లోని మత్స్యకారుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. వజ్రపుకొత్తూరు మండలంలోని పూడిలంక, మంచినీళ్లపేట, హుకుంపేట గ్రామాల్లో మంగళవారం ఆమె పర్యటించి మత్స్యకార కుటుంబాలు, తీరప్రాంత ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నందున మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. సముద్ర పరిస్థితులు పూర్తిగా అనుకూలించే వరకు ఎట్టి పరిస్థితుల్లోనూ చేపల వేటకు వెళ్లకూడదని, అధికారుల నుంచి వచ్చే హెచ్చరికలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. తీరప్రాంత గ్రామాల పర్యటనలో మత్స్యకారులతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే.. తుఫాన్ కారణంగా చేపల వేట నిలిచిపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులు, కుటుంబాల జీవన పరిస్థితులు, తాగునీరు, విద్యుత్, రహదారులు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ సహాయం ఎలా అందాలి, ప్రస్తుతం అందుతున్న సేవల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయనే అంశాలపై కూడా వివరాలు సేకరించారు. తుఫాన్ సమయంలో ముందస్తు అప్రమత్తతే ప్రాణనష్టాన్ని నివారించే ప్రధాన మార్గమని ఎమ్మెల్యే వెల్లడించారు . తీరప్రాంతాల్లో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండాలని, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే స్పందించేందుకు శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. మత్స్యకార కుటుంబాలకు అవసరమైన సహాయక చర్యలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, రహదారులు వంటి మౌలిక సదుపాయాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావంతో సముద్రంలోకి వెళ్లలేని మత్స్యకార కుటుంబాల పరిస్థితిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో పరిస్థితులను నిరంతరం గమనించాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదు. తీరప్రాంత ప్రజలకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుంది. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి. మత్స్యకారులు ప్రాణాలను పణంగా పెట్టి సముద్రంలోకి వెళ్లకుండా అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి అని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. తుఫాన్ పరిస్థితులు పూర్తిగా చక్కబడే వరకు తీరప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ, అవసరమైన సహాయక చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆమె అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో వజ్రపుకొత్తూరు ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, మత్స్య శాఖ అధికారులు, కూటమి నాయకులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వెంకటరమణ కుటుంబానికి ఆర్థికసాయం



**మందస, సెప్టెంబరు 22(వార్త):** లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకట రమణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. దీంతో ఆ కుటుంబ కష్టాలు తెలుసుకుని, మీకు అండగా ఉంటామంటూ.. లొహరిబంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2019-2020 పూర్వ విద్యార్థులు తమ వంతు సహాయంగా రూ.8,300లు ఆ కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో నక్క షణ్ముఖరావు, పిన్నింటి యోగి, ధర్మాన గోపిక్రిష్ణ, మురపాల మణికంత, మురపాల శశిభూషణ రావు, బద్రి లక్ష్మీనారాయణ, ధర్మాన చందు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఉత్సవాలకు సతీష్ రూ.10 వేల విరాళం



**పాతపట్నం, సెప్టెంబరు 22 (వార్త):** పాతపట్నం మండల పరిధిలోని కాపు గోపాలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపానికి పాతపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షులు సైలాడ సతీష్ 10 వేలు విరాళాన్ని అందజేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక చవితి వేడుకలను ప్రజలందరూ సుఖసంతోషాలతో, భక్తిభావంతో జరుపుకోవాలని, గ్రామంలో అందరూ ఐక్యంగా ఉంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, ఇలాంటి సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు యువతలో ఐక్యతను పెంపొందిస్తాయని సతీష్ పేర్కొన్నారు.

## మహేంద్రతనయ కాజ్‌వే వద్ద హెచ్చరిక బోర్డులు




**పాతపట్నం, సెప్టెంబరు 22 (వార్త):** స్థానిక మహేంద్రతనయనదీ కాజ్‌వే వద్ద పాతపట్నం సర్కిల్ పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కురుస్తున్న వర్షాలకు నదిలో నీటి ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో కాపు గోపాలపురం, హెచ్ గోపాలపురం గ్రామాల ప్రజలు, కాజ్‌వే మీదగా ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని వారిని అప్రమత్తంగా ఉంచేందుకు పాతపట్నం సిఐ కె వెంకటరావు, ఎస్ఐ కె మధుసూదనరావు ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులను, స్టాపర్లను ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు కాజ్‌వే దాటడం ప్రమాదకరమని, ప్రజలు పోలీసులకు సహకరించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాలని సిఐ వెంకటరావు తెలిపారు. ముఖ్యంగా వరద ఉధృతి పెరిగితే కాజ్ వే పై వాహన రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేస్తామని, ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకుంటున్నామని, పోలీసుల సూచనలను పాటించాలని వారు ప్రజలను కోరారు.

## నీలమణి దుర్గమ్మ నిత్యాన్నదానానికి రూ.20 వేలు



**పాతపట్నం, సెప్టెంబరు 22 (వార్త):** ఉత్కళాంధ్రుల ఇలవేల్పు పాతపట్నంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్య అన్నప్రసాద కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభిస్తోంది. పాతపట్నంకు చెందిన మేడిపాకల సూర్యప్రకాష్ ఆచారి రోజారాణి దంపతులు, తమ కుమారులు బ్రహ్మ సరోజి, సాయి స్వరూప్‌లతో కలిసి మంగళవారం 20 వేల రూపాయలను ఈ అన్నదాన కార్యక్రమానికి విరాళంగా ఆలయ కమిటీ చైర్మన్ అక్కంద్ర సన్యాసిరావుకు అందజేసారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్, కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది కోడి సుదర్శన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## తుపాను నేపథ్యంలో ఉచిత వైద్య శిబిరాలు

**సోంపేట, సెప్టెంబరు 22 (వార్త):** తుపాను నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు కొర్ల పిహెచ్సి పరిధిలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోషిని తెలిపారు. కొర్లంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించి స్థానిక ప్రజలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. వర్షాల సందర్భంలో ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పాలవలస, కర్తలిపాలెం గ్రామాల్లో కూడా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోగులను పరిశీలించి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## నిత్యావసరాల ధరల నియంత్రణలో కూటమి ఘోర వైఫల్యం

### - మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




**పాతపట్నం, సెప్టెంబరు 22(వార్త):** కూటమి ప్రభుత్వంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు జీవించలేని పరిస్థితి దాపురించిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో టిడిపి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆమె ఆరోపించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన ఫేక్ మాటలను నమ్మి ప్రజలు మోసపోయారని, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటే, ప్రస్తుత కూటమి పాలనలో దుర్భిక్షం నెలకొందని విమర్శించారు. జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రూ. 1,200 ఉన్న బియ్యం బస్తా ధర ఇప్పుడు రూ. 1,800 కి చేరిందని, దీనికి తోడు నూనె, ఉల్లి, చింతపండు, కూరగాయలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ఛార్జీలు అమాంతం పెంచేసి ప్రజలను అడ్డంగా దోచుకుంటున్నారని ఆమె మండిపడ్డారు. ఉచిత ఇసుక, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అంటూ కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, వంశధార నదీ తీర గ్రామాల నుండి ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలిస్తూ స్థానిక ప్రజలను మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరలు తగ్గించే వరకు ప్రజల పక్షాన పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీకి ఎందుకు ఓటయ్యాలో ప్రజలందరూ ఒకసారి ఆలోచించాలని ఆమె పిలుపునిచ్చారు.

## తులసీదాసు, నారాయణరావు, శారదమ్మకు ఘన నివాళి



**మందస, సెప్టెంబరు 22(వార్త):** మజ్జి కుటుంబంలో తులసీదాసు, నారాయణరావు, శారదమ్మ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి, మాజీ ఎంఎల్ఏ, రాజ్యసభ మాజీ సభ్యుడు స్వర్గీయ మజ్జి తులసీదాసు, మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ మజ్జి నారాయణరావు, మాజీ ఎంఎల్సీ స్వర్గీయ మజ్జి శారదమ్మ వర్ధంతి కార్యక్రమాలు మందస పట్టణంలోని జేకే కల్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పీడిత పేద ప్రజల కోసం వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం సాగించిన దివంగత నేత మాజీ పిసిసి అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మజ్జి తులసీదాసు, మాజీ ఎమ్మెల్యే మజ్జి నారాయణరావు, మాజీ ఎమ్మెల్సీ మజ్జి శారదల బాటలో మజ్జి కుటుంబీకుల అభిమానులు నేటి తరం పయనించాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి దివంగత నేతలు మజ్జి తులసీదాస్, మజ్జి నారాయణరావు, మజ్జి శారదలు పాటు పడ్డారని, ప్రస్తుత పలాస అసెంబ్లీ నియోజకవర్గంలో పాటు పూర్వపు సోంపేట అసెంబ్లీ నియోజకవర్గాన్ని శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని అన్నారు. ఈ ముగ్గురు దివంగత నేతలు ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని వారి స్ఫూర్తిని తీసుకుని గ్రామాల్లో ప్రజా సమస్యల పైన, రైతాంగం సమస్యల పైన పని చేయాలని కోరారు. దివంగత నేతలు ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో న్యాయవాది మజ్జి సుధాబాల, డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, కొర్ల హేమారావు చౌదరి, కొర్ల నాగేశ్వరరావు, బేసి శ్యామ సుందరరావు, దుప్పల చలపతి, తెంబూరు మధు, మజ్జి బాబురావు, బద్రి సీతమ్మ, ఉప్పాడ రాజారావు, పైడి పట్టాభిరామారావు, మార్పు మన్మధరావు, ఉగ్రిపల్లి కృష్ణారావు, కర్రి పాపారావు, కొర్ల విశ్వనాథం, బతకల మోహన రావు తదితరులు ప్రసంగించారు. మజ్జి కుటుంబీకుల అభిమానులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా దివంగత నేతలు మజ్జి తులసీదాస్ మజ్జి నారాయణరావు మజ్జి శారదమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## రైతు ఉద్యమ ఐక్యతకు కొత్త అడుగు

### వినాశకర శక్తుల నుంచి దేశం, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

### విశాల ఐక్యసంఘటనే లక్ష్యం: సీపీఐ(ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య

**పలాస, సెప్టెంబరు 22 (వార్త):** భారత రైతాంగ ఉద్యమంలో ఐక్యతకు మరో కీలక అడుగు పడింది. కార్పొరేట్ అనుకూల విధానాలు, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా రైతుల ప్రతిఘటనను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ(ఎంఎల్) నేత కామ్రేడ్ దీపాంకర్ భట్టాచార్య హెచ్చరించారు. దేశం, రాజ్యాంగాన్ని వినాశకర శక్తుల నుంచి కాపాడేందుకు విశాల ఐక్యసంఘటన అవసరమన్నారు. జలంధర్‌లోని చారిత్రాత్మక దేశభక్త్ యాద్‌గార్ హాల్‌లో మంగళవారం అఖిల భారత కిసాన్ మహాసభ 5వ అఖిల భారత మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పంజాబ్ కిసాన్ యూనియన్, జంహూరీ కిసాన్ సభ, హర్యానాకు చెందిన పగ్డీ సంభాల్ జట్టా సంస్థలు అఖిల భారత కిసాన్ మహాసభలో విలీనమైనట్లు ప్రకటించారు. రైతు ఉద్యమాన్ని మరింత సమన్వయంతో ముందుకు తీసుకెళ్లేందుకు ఈ పరిణామం దోహదపడుతుందని నాయకులు తెలిపారు. ప్రారంభ సమావేశంలో కామ్రేడ్ మంగత్‌రామ్ పస్లా, కామ్రేడ్ రాజారామ్‌సింగ్, కామ్రేడ్ సత్నామ్‌సింగ్ అజ్నాలా, కామ్రేడ్ రాజీవ్ దిమ్రీ, కామ్రేడ్ సత్యదేవ్‌రామ్, డాక్టర్ సునీలం తదితరులు ప్రసంగించారు. రైతుల సమస్యలు, కార్పొరేట్ విధానాల ప్రభావం, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్‌కు ఆరు జాతీయ కౌన్సిల్ స్థానాలు ఏర్పాటు చేసి, మహాసభలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఆరుగురిని జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నారు. డి. హరనాథ్, మద్దిల రామారావు, తోట ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, పి. వెంకటేశ్వర్లు, డేవిడ్‌రాజు పి.లకు ఈ బాధ్యతలు అప్పగించారు. దేశవ్యాప్తంగా మొత్తం 151 మందిని జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



### నూతన నాయకత్వం ఎన్నిక

అఖిల భారత కిసాన్ మహాసభ ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ పురుషోత్తం శర్మ, జాతీయ అధ్యక్షుడిగా కామ్రేడ్ సత్నామ్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. 16 మందితో కోర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతాంగ సమస్యలపై దేశవ్యాప్తంగా జరుగుతున్న పోరాటాలను సమన్వయం చేయడం, రైతు సంఘాల మధ్య ఐక్యతను పెంపొందించడం, ప్రజాస్వామ్య--రాజ్యాంగ పరిరక్షణ అంశాలపై విస్తృతంగా ఉద్యమాలను నిర్వహించడం వంటి అంశాలు మహాసభలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు నాయకులు తెలిపారు. రైతాంగ ఉద్యమం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో వివిధ రైతు సంఘాల ఐక్యత ప్రాధాన్యం సంతరించుకుందని, విస్తృత స్థాయిలో సంఘటిత పోరాటాలను ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని నాయకులు వెల్లడించారు.

## పలాసలో కుండపోత.. జలమయమైన రహదారులు

### - అల్పపీడన ప్రభావంతో ఎడతెరిపిలేని వర్షం - లోతట్టు ప్రాంతాల్లోకి చేరిన నీరు - ప్రధాన రహదారులపై నిలిచిన వర్షపు నీరు - వాహన దారులకు తీవ్ర ఇబ్బందులు -పంటలకు మేలంటున్న రైతులు



**పలాస, సెప్టెంబరు 22 (వార్త):** అల్పపీడన ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతంలో మంగళవారం కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పలాస--కాశీబుగ్గ జంట పట్టణాల్లోని పలు రహదారులు జలమయమయ్యాయి. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో సాధారణ జనజీవనం కొంతమేరకు స్తంభించింది. పలాస, కాశీబుగ్గతో పాటు మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోనూ విస్తారంగా వర్షం కురిసింది. పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులు, అంతర్గత వీధుల్లో నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కురిసిన ప్రతిసారీ పలాస పట్టణంలోని పలు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడం సమస్యగా మారుతోంది. వర్షపు నీరు సక్రమంగా వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు ప్రధాన కాలువలు, మురుగు కాలువలను ముందుగానే శుభ్రం చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు. మరోవైపు విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత వర్షాలు పంటలకు ఉపయోగకరంగా ఉంటాయని చెబుతున్నారు. సాగు పనులకు, పంటల ఎదుగుదలకు ఈ వర్షాలు దోహదపడతాయని రైతులు ఉంటున్నారు. అయితే భారీ వర్షాలు మరికొంతకాలం కొనసాగితే పొలాల్లో నీరు నిలిచి పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉన్నందున పరిస్థితిని రైతులు నిశితంగా గమనిస్తున్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## 116 వంటకాలతో విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు



**పాతపట్నం, సెప్టెంబరు 22 (వార్త):** స్థానిక కోటగుడ్డికాలనీలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో కాలనీవాసులు, మహిళలు నిష్ఠతో తయారు చేసిన పిండివంటలు, తీపి పదార్థాలు, నైవేద్యాలను 116 రకాల రూపాల్లో గణనాథునికి నైవేద్యంగా అర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కాలనీవాసులు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ వేడుకలతో కోటగుడ్డి కాలనీలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది.

## ఒడియా బీసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**సోంపేట, సెప్టెంబర్ 22(వార్త):** ఒడియా సామాజిక వర్గాలతో కూడిన బీసీ వర్గాలను ఒడియా బీసీ కార్పొరేషన్ పేరిట ఒక ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఎంజే పూలే రాష్ట్ర బీసీ సంఘం డిమాండ్ చేసింది. సోంపేటలో గుడియా సామాజిక వర్గీయుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన వినాయక చవితి రజితోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఈ సందర్భంగాజిల్లా స్థాయిలో మధుర కులస్తులు హాజరై తమ విద్యార్థులను పలు రకాలుగా ప్రోత్సాహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నేతలు మాట్లాడుతూ ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఇప్పటికి వెనుక బడిన ఒడియా సామాజిక వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మీ ప్రయత్నాలు పోరటానికి ఎంజే పూలే సంఘం అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా గుడియా కుల విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు అలాగే పరీక్షలలో ప్రతిభ సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.పలువురు ప్రముఖులను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో బీన ఢిల్లీరావు, దుక్క లోకేశ్వర్ రెడ్డి, గుడియా సామజికవర్గ ప్రముఖులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# రూ.25 కోట్లతో పట్టణ మౌలిక వసతులకు ఊతం

**- హెచ్ఎమ్ పథకం ద్వారా పలాస-కాశీబుగ్గ అభివృద్ధి పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన**

**-పనులు వేగంగా పూర్తి చేయాలి.. నాణ్యతలో రాజీ వద్దు : ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, సెప్టెంబరు 22(వార్త):** పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల మౌలిక వసతుల అభివృద్ధికి రూ.25 కోట్ల విలువైన పనులు మంజూరు కావడం పట్టణ ప్రగతికి కీలక ముందడుగని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఎమ్) పథకం ద్వారా చేపట్టనున్న అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరిస్తున్న నేపథ్యంలో జనాభా, వాహన రాకపోకలు, వాణిజ్య కార్యకలాపాలకు అనుగుణంగా మౌలిక వసతులను కూడా విస్తరించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గతంలో ఏర్పడిన మౌలిక వసతులపై పెరుగుతున్న పట్టణ అవసరాల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, పట్టణ రవాణా తదితర ప్రాథమిక సదుపాయాలను మరింత బలోపేతం చేయాల్సి ఉందన్నారు. హెచ్ఎమ్ పథకం ద్వారా చేపట్టనున్న పనులతో పట్టణంలో మౌలిక సదుపాయాల నాణ్యత మెరుగుపడటంతో పాటు, ప్రజలకు అందే పట్టణ సేవల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పనులు కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. రూ.25 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన జరగడం తొలి అడుగు మాత్రమేనని, అసలు ఫలితం పనుల అమలు, నాణ్యత, నిర్వహణపైనే ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి పనులను నిర్ణీత గడువులో ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాసిరకం పనులకు తావులేకుండా పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధిలో రహదారులతో పాటు డ్రైనేజీ వ్యవస్థకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. వర్షాకాలంలో నీరు నిలిచిపోకుండా, మురుగునీటి పారుదల సక్రమంగా జరిగేలా శాశ్వత పరిష్కారాల దిశగా పనులు ఉండాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల రాకపోకలకు అనుగుణమైన పట్టణ మౌలిక వసతులు వంటి అంశాలను సమగ్ర ప్రణాళికలో భాగంగా చూడాల్సిన అవసరం ఉందన్నారు. పలాస-కాశీబుగ్గను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికాబద్ధమైన పట్టణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని గౌతు శిరీష తెలిపారు. పట్టణ ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, సౌకర్యవంతమైన రవాణా, పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన మౌలిక వసతులు అందేలా ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. పలాస నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. రూ.25 కోట్ల అభివృద్ధి పనుల అమలుతో పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ మౌలిక వసతులకు మరింత బలం చేకూరుతుందని, పనులు పూర్తయిన తర్వాత వాటి ప్రయోజనం నేరుగా పట్టణ ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గౌతు శిరీష చెప్పారు. ఈ కార్యక్రమంలో పలాస మున్సిపల్ కమిషనర్ ఐ.శ్రీనివాసులు, మునిసిపల్ అధికారులు, సిబ్బంది, ముఖ్య కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న వీధి వ్యాపారులకు పీఎం స్వనిధి రుణాలు



**పలాస, సెప్టెంబరు 22 (వార్త):** అర్హత ఉన్న వీధి వ్యాపారులకు పీఎం స్వానిది రుణాలు అందించాలని పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు తెలిపారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘ పరిధిలో వీధి వ్యాపారులు, స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణాల ప్రగతిని సమీక్షించేందుకు మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం లోక కళ్యాణ మేళా నిర్వహించారు. ప్రధానమంత్రి స్వానిధి (పీఎం స్వానిది) పథకం కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల పరిష్కారం నుంచి రుణాల మంజూరు, పంపిణీ, తిరిగి చెల్లింపుల వరకు వివిధ అంశాలపై బ్యాంకు అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వీధి వ్యాపారులకు పీఎం స్వానిది రుణాలు సకాలంలో అందేలా బ్యాంకులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను బ్యాంకుల వారీగా పరిశీలించి, రుణాల మంజూరులో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అవసరమైన పత్రాల సమర్పణ, దరఖాస్తుల పరిశీలన, రుణాల విడుదలలో అనవసర జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే రుణాలు పొందిన వీధి వ్యాపారులు సక్రమంగా వాయిదాలు చెల్లించేలా అవగాహన కల్పించాలని, రుణాలను క్రమం తప్పకుండా తిరిగి చెల్లిస్తున్న అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల ప్రకారం ద్వితీయ, తృతీయ విడత రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రుణాల చెల్లింపు క్రమశిక్షణతో వీధి వ్యాపారులకు మరింత ఆర్థిక సహాయం అందే అవకాశం ఉన్నందున ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. లోక కళ్యాణ మేళాలో భాగంగా పీఎం స్వానిది పథకం కింద తృతీయ విడత రుణం పొందిన, క్రెడిట్ కార్డులకు అర్హత సాధించిన లబ్ధిదారులకు కమిషనర్ ఇ. శ్రీనివాసులు క్రెడిట్ కార్డులను పంపిణీ చేశారు. పట్టణంలోని స్వయం సహాయక సంఘాల (రాం+ం ఎస్ హెచ్ జి ఎస్ ) బ్యాంక్ లింకేజీపైనా సమీక్ష నిర్వహించారు. అర్హత కలిగిన సంఘాలకు బ్యాంకు రుణాలు సకాలంలో అందేలా మెప్మా సిబ్బంది, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న రుణ దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, అర్హత ఉన్న సంఘాలకు రుణ మంజూరు, పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. వీధి వ్యాపారులు, స్వయం సహాయక సంఘాలకు అందుతున్న రుణాలు వారి ఆర్థిక కార్యకలాపాలకు తోడ్పడేలా ఉండటంతో పాటు, పథకాల లక్ష్యాలు పూర్తిస్థాయిలో చేరేందుకు దరఖాస్తు నుంచి రుణ పంపిణీ వరకు ప్రతి దశలో సమన్వయం అవసరమని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా సి ఎమ్ ఎమ్ పి. మోహనరావు, మెప్మా సిబ్బంది, పలాస--కాశీబుగ్గ పరిధిలోని వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల వేళ పలాసలో అప్రమత్తత

**-నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చూడాలి-లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలి -పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, సెప్టెంబరు 22 (వార్త):** భారీ వర్షాల నేపథ్యంలో పలాస--కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అధికారులను ఆదేశించారు. వర్షాల పరిస్థితిని స్వయంగా పరిశీలించిన ఆమె.. సమస్య ఏర్పడిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ప్రమాద ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఉత్తరాంధ్రలో భారీ వర్షాల హెచ్చరికలు కొనసాగుతున్న దృష్ట్యా పట్టణంలోని కాలువలు, డ్రైనేజీలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె సూచించారు. ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావుతో కలిసి పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆమె క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. దేశబట్టి కాలువపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, దేశబట్టి చెరువు సమీపంలోని కాలువలో నీటి ప్రవాహాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. రైల్వే పనుల నేపథ్యంలో కాలువ వద్ద గ్రావెల్ వేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడే పరిస్థితి ఉందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. భారీ వర్షాలు కురిస్తే నీరు సక్రమంగా వెళ్లక పరిసర ప్రాంతాల్లోని ఇళ్లకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని వివరించారు. రైల్వే పనులను పరిశీలించి ఎమ్మెల్యేతో పాటు సంబంధిత అధికారులను అక్కడికే పిలిపించి, కాలువలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకం లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతం చేసి, నీరు సజావుగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. డ్రైనేజీలపై తక్షణ నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మూడు రోడ్ల జంక్షన్ వద్ద డ్రైనేజీ పరిస్థితిని ఎమ్మెల్యే పరిశీలించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీలను వెంటనే శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహానికి అడ్డంకులుగా ఉన్న మట్టి, చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి వరదనీరు త్వరగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట పారిశుద్ధ్య, మున్సిపల్ సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు. వర్షాలు కొనసాగుతున్నంతకాలం క్షేత్రస్థాయిలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. సమస్య వచ్చిన తర్వాత కాదు.. ముందే చర్యలు తీసుకోవాలని, భారీ వర్షాల సమయంలో సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కంటే.. ప్రమాదం సంభవించే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడమే ముఖ్యమని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. కాలువలు, డ్రైనేజీలు, లోతట్టు ప్రాంతాల్లో నీటి ప్రవాహ పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని చెప్పారు. ఎక్కడైనా నీరు నిలిచినా, ప్రజలకు ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. రైల్వే, మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ వర్షాల ప్రభావం తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యమని, భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా యంత్రాంగం ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే గౌతు శిరీష స్పష్టం చేశారు. ఈ పర్యటనలో పలాస మున్సిపల్ కమిషనర్ ఐ శ్రీనివాసులు, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లోడగల కామేష్, పలాస ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, సప్పు నవీన్, గురిటి సూర్యనారాయణ, దేశం కార్యకర్తలు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-మూడు రోజులపాటు భారీ వర్షాలు, ఈదురుగాలుల అవకాశం..**

**-మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు**

**-విద్యుత్ వైర్లు, స్తంభాలు, చెట్లు, హోర్డింగులకు దూరంగా ఉండాలి**

**-మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**



**పలాస, సెప్టెంబరు 22 (వార్త):** తుఫాను ప్రభావంతో రానున్న మూడు రోజులపాటు పలాస నియోజకవర్గంలో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు విజ్ఞప్తి చేశారు. వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు. మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ సముద్రంలోకి వెళ్లవద్దని, ఇప్పటికే సముద్రంలో ఉన్నవారు వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. తీర ప్రాంత ప్రజలు ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని, ఉద్దానం ప్రాంతంలోని రైతులు వర్షాలు, గాలుల ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నా, వైర్లు తెగిపడినా వాటిని తాకకుండా సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. నీటిలో విద్యుత్ వైర్లు పడిన ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్త వహించాలని కోరారు. భారీ వర్షాల సమయంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున కుటుంబ అవసరాలకు సరిపడా నీటిని ముందుగానే నిల్వ చేసుకోవాలని సూచించారు. పాలు, మందులు, శిశువులకు అవసరమైన వస్తువులు, నిత్యావసర సరుకులు, టార్చ్‌లైట్లు తదితర అత్యవసర వస్తువులను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. మొబైల్ ఫోన్లను ముందుగానే ఛార్జింగ్ చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితి లేకపోతే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముఖ్యంగా భారీ వర్షాలు, ఈదురుగాలుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, పాత భవనాల సమీపంలో ఉండకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో చిన్నారులు, వృద్ధులు వెళ్లకుండా కుటుంబ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో వైఎస్సార్‌సీపీ శ్రేణులు తుఫాను పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజలకు అందుబాటులో ఉండాలని డాక్టర్ సీదిరి అప్పలరాజు సూచించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలను గుర్తించి అవసరమైన సహాయ కార్యక్రమాలకు సిద్ధంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వృద్ధులు, మహిళలు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారికి సహాయం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రజల భద్రతే ప్రతి ఒక్కరి ప్రధాన బాధ్యతని, అధికార యంత్రాంగం సూచనలు పాటిస్తూ సమన్వయంతో వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అప్రమత్తత, ముందస్తు జాగ్రత్తలతో తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## తుపాను ప్రాంతాల్లో నాయకులు, అధికారుల పర్యటన



**మందస, సెప్టెంబరు 22(వార్త):** అర్నబ్ తుపాను ప్రభావంతో మందస మండలంలో ఏర్పడిన అత్యవసర పరిస్థితుల దృష్ట్యా పలాస నియోజకవర్గ శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస మండల నాయకులు, ప్రభుత్వ అధికారులు సంయుక్తంగా పరిసర గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. తుపానుతో కురుస్తున్న వర్షాల వల్ల కలిగిన నష్టాన్ని, ప్రజల భద్రతా పరిస్థితులను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా తుపాను ధాటికి వర్షపు నీటిలో తడిసి, గోడలు బలహీనపడి కూలిపోయే స్థితికి చేరిన 51 ఇళ్లను అధికారులు గుర్తించారు. ఇందులో ముఖ్యంగా రట్టి గ్రామానికి చెందిన 5 ఇళ్లు, దున్నూరు గ్రామానికి చెందిన 2 ఇళ్లు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తేలింది. ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యగా ఆయా ఇళ్లలోని కుటుంబాలను అధికారులు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ సందర్భంగా మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన మాట్లాడుతూ తుపాను ముప్పు తొలగిపోయే వరకు ప్రజలందరూ తీవ్ర అప్రమత్తతతో ఉండాలన్నారు. వర్షాల ధాటికి పాతబడిన ఇళ్లలో ఉండకుండా సురక్షిత ప్రదేశాల్లో ఆశ్రయం పొందాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున జాలర్లు ఎవరూ వేటకు వెళ్లవద్దని, అలాగే సముద్ర తీరంలో ఉన్న బోట్లు, వలలు సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు మండల యంత్రాంగం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో మందస తహసీల్దార్ బి.శ్రీహరిబాబు, సైక్లోన్ ప్రత్యేకాధికారి పి.చంద్రశేఖర్, ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ జీవన్, వీఆర్వో హేమరాజు, మండల అధ్యక్షుడు బావన దుర్యోధనలతో పాటు స్థానిక సీనియర్ నాయకులు లబ్బ రుద్రయ్య, ముంజేటి చంద్రశేఖర్, నవీన్ యాదవ్, ఔగాన ఈశ్వర రావు, రట్టి హేమరాజు, పూలారి సిద్దు, అధికారులు పాల్గొన్నారు.

## సాయినగర్‌లో చెరువును తలపిస్తున్న వీధులు



**నరసన్నపేట, సెప్టెంబరు 22 (వార్త):** నరసన్నపేటలోని సాయినగర్ ప్రాంతంలో వర్షపు నీరు రహదారులపై భారీగా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షం కురిసిన ప్రతిసారీ వీధులు జలమయంగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కురిసిన వర్షాలకు సాయినగర్‌లోని ప్రధాన వీధితో పాటు పరిసర ప్రాంతాల్లో నీరు పెద్దఎత్తున చేరింది. దీంతో రహదారి చెరువును తలపించేలా మారడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంది. వర్షపు నీరు సక్రమంగా బయటకు వెళ్లేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్థానికులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, పంచాయతీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించలేదని వారు వాపోతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే పరిస్థితి పునరావృతమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సాయినగర్ ప్రాంతాన్ని పరిశీలించి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా అవసరమైన డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి తమ ఇబ్బందులను తొలగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## శ్రీకాకుళం

### తీర ప్రాంతాల్లో టీడీపీ నాయకుల పర్యటన



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22 (వార్త):** బూర్జపాడు పంచాయతీ డొంకూరు గ్రామంలో తెలుగుదేశం నాయకులు పర్యటించారు.సముద్రం ఒడ్డు వద్ద నున్న మత్యకారులకు , అదే విధంగా చేపలు వేటకు ఎవరు వెళ్లకూడదు అందరు ప్రభుత్వ అధికారులు చెప్పిన విషయం అందరు పాటించి జాగ్రత్తగా ఉండాలని తుపాన్ ప్రభావం ఎక్కువ కారణంగాఆ ప్రాంతాల్లో ప్రజలు అందరు కలిసి తుపాన్ బిల్డింగ్ లో ఉండాలని అందరికీ కలిసి జాగ్రత్తగా ఉండాలని కోరుతూ ప్రభుత్వం ఇస్తున్న సహాయం సహాకారం మందులు తీసుకోవాలని పునరావాస కేంద్రాల్లో అందరు తమ కుటుంబ సభ్యులు అందరితో కలిసి ఉండాలని అదే సమయంలో పక్క భవనాలు లలో ఉండాలని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం చెప్పున్నచూచిన చేస్తున్నట్లు మనం ఉండాలని అదే సమయంలో ఏవన్నా సమస్యలు ఉంటే అధికార్లకు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బి అశోక్ కి పోన్ ద్వారా తెలియాలని కోరారు శాసన సభ్యులు పిలుపు మేరకు ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ఎల్ పద్మనాభం,ఇచ్ఛాపురం పూర్వ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు, పి బాబ్జీ,ఎస్ సహదేవ్ రెడ్డి, ఎం.సూర్యనారాయణ, పి దుర్యోధనరెడ్డి, బోర రాజేంద్ర ప్రసాద్, ఆశిమాధవరావు, ప్రకాశ్ చంద్రనాయక్,ఎ.ఈశ్వరరావు,బోర యువరాజ్, ఆర్ ధర్మారావు, పిచంద్రశేఖర్,పి. హేమరాజు,పంచన నబెహర, పి.పురుషోత్తం, దున్న లోకేష్, దున్న కుర్మారావు, సి హెచ్.సూర్యనారాయణ, సి హెచ్.గురుమూర్తి,దున్న కామేష్, డి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారి వైద్యానికి సాయం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22 (వార్త):** కోరపం గ్రామానికి చెందిన 6 నెలల చిన్నారి బాబు నక్క హర్షవర్ధన్ మెదడు వాపు వ్యాధితో వైజాగ్ కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ లో కోమా స్టేజ్ లో ఉన్నాడు. అందుకు నిస్సహాయులైన ఆ నిరుపేద తల్లిదండ్రులు సాయం కోరారు. ఈ విషమ పరిస్థితిని పూర్తి స్థాయిలో తెలుసుకుని నిర్ధారణ చేసుకున్నాక జి ఎస్ ఫౌండేషన్ సభ్యులు కలసి వాట్సాప్ స్టేటస్ లో పెట్టడం జరిగింది.దాతలు అందరూ మంచి మనసుతో స్పందించి తమ అమూల్యమైన సాయం అందించారు.సమకూరిన ఆ సాయం ఏడు వేల రూపాయలను బాబు తండ్రికి అందజేసారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా సాయం అందించిన ప్రతీ ఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేసారు.

### 26వ వార్డు టీడీపీ ఇన్‌చార్జిగా జగదీష్



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ నూతన 26వ వార్డు తెలుగుదేశం పార్టీ వార్డు ఇన్‌చార్జిగా సాలిన జగదీష్‌యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ అశోక్‌కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

### తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల పర్యటన



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22 (వార్త):** ముంచుకోస్తున్న ఆర్నబ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు. తహసీల్దార్ వెంకటరావు సి ఐ చిన్నం నాయుడు లు డొంకూరు బూర్జ పాడు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. సన్యాసి పుట్టుగ లో నీలపు రాజమ్మ పూరి గుడిసె ధ్వంచం అయ్యింది. డొంకురు లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

### బీసీయూ పార్టీ పలాస యూత్ కన్వీనర్ గా అడ్డి రాజు

**మందస, సెప్టెంబరు 22(వార్త):** భారత చైతన్య యువజన పార్టీ పలాస నియోకవర్గం యూత్ కన్వీనర్ అడ్డి రాజు(ఇందుపరివార్ రాజు) నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ నుంచి రాజుకు ఉత్తర్వులు అందాయి. మందస మండలంలోని సువర్ణపురం పంచాయతీ ఉగ్రవానిపేట గ్రామానికి చెందిన రాజుకు సాయం చేసే గుణం ఉంది. కబడ్డీ క్రీడాకారుడు కావడంతో కబడ్డీ ఆటకు ఆయన ఎంతగానో ప్రోత్సహిస్తుంటారు. అంతేకాదు.. కబడ్డీ క్రీడలకు ఆర్థిక సాయం కూడా అందజేస్తుంటారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా రాజు భాగస్వామ్యమవుతూ.. తన వంతు సాయం చేస్తుంటారు. సోషల్ వర్కర్ గా గుర్తింపు ఉండడంతో రాజు సేవలను భారత చైతన్య యువజన పార్టీ గుర్తించింది. ఇందుపరివార్ రాజు భారత చైతన్య యువజన పార్టీ పలాస నియోకవర్గం యూత్ కన్వీనర్ గా నియమితులు కావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రాజు అభిమానులు ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ సందర్బంగా రాజు మాట్లాడుతూ భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం తనదైన శైలిలో నిరంతరం కృషి చేస్తానన్నారు. పార్టీలోని నాయకులు, కార్యకర్తలను కలుపుకొని, బలోపేతం చేస్తానన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# రెండు చైన్ స్నాచింగ్ కేసుల్లో నలుగురి అరెస్టు

**-కంచిలి, మందసలలో వరుస దొంగతనాలు**

**- రెండున్నర తులాల బంగారం, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం**

**- మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్**



**మందస, సెప్టెంబరు 22(వార్త):** మందస మండలంలోని బిన్నలమదనాపురం పంచాయతీలో గల వెంకటవరదరాజపురంలో గత నెలలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో నలుగురును అరెస్ట్ చేసినట్టు మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు. మందసలో పోలీసు స్టేషన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల ఆగస్టు 28న వెంకటవరదరాజపురంలో చైన్ స్నాచింగ్ సంఘటన జరిగిందన్నారు. కేసు నమోదు చేసిన అనంతరం దర్యాప్తు కొనసాగించామన్నారు. కరాపట్నం అయ్యావారిపేట జంక్షన్ లో సీసీ కెమేరాల పుటేజీలను పరిశీలించామన్నారు. బైక్ నంబర్లు ఆధారంగా దర్యాప్తు ముమ్మరంగా చేశామన్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై జంటలుగా నలుగురు వ్యక్తులు వెంకటవరదరాజపురం వద్ద స్నాచింగ్ కు పాల్పడ్డారని తెలిపారు. మందస మండలంలోని కొత్తపల్లి జాతీయ రహదారి సమీపంలో నిందితులను గుర్తించి, అరెస్ట్ చేశామన్నారు. కంచిలి మండలంలో జరిగిన చైన్ స్నాచింగ్ సంఘటనలో వీరి ప్రమేయం ఉన్నట్టు దర్యాప్తులో వెల్లడైందన్నారు. రెండు కేసులకు సంబంధించి ఒడిశా రాష్ట్రానికి చెందిన చందన మహరణ, సంగీత మహరణ, భాగ్యశ్రీ మహరణ, రాజేంద్ర మహరణలను అరెస్ట్ చేశామన్నారు. వీరంతా ఒడిశాలోని బరంపురం పరిసర ప్రాంతాల్లో ఆలయాల నిర్మాణం పనులు చేసుకుంటూ, వారి వద్దే హెల్పర్లుగా ఉండేవారన్నారు. సొంత అక్క చెల్లెలైన సంగీత, భాగ్యశ్రీలు చందన, రాజేంద్రలతో వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. విలాసాలకు తగినంత డబ్బు లేకపోవడంతో దొంగతనాలు, చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆరు నెలల క్రితం నుంచే మందస, కంచిలి ప్రాంతాల్లో రెక్కీ చేశారని, 28న మందస మండలంలోని వీవీఆర్ పురం, కంచిలి మండలంలోని భైరిపురంలలో చైన్ స్నాచింగ్ కు చేశారన్నారు. దొంగలించిన బంగారు నగలను అమ్మడానికి పలాస వైపు వెళ్తుండగా.. వీరిని అరెస్ట్ చేశామన్నారు. వీరి వద్ద నుంచి రెండున్నర తులాల బంగారం, రెండు దిచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ నలుగురును కోర్టుకు తరలించామని ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ చెప్పారు.

## విద్యార్థులను ప్రోత్సాహించడం అభినందనీయం



**సోంపేట, సెప్టెంబరు 22 (వార్త):** విద్యార్థులను ప్రతి సందర్భంలోనూ ప్రోత్సాహించడం చాలా అభినందనీయం అని కంచిలి జడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి పేర్కొన్నారు. చోట్రాయిపురం గ్రామంలో వినాయక ఉత్సవాలు సందర్బంగా డివిజన్ స్థాయి క్విజ్ పోటీలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగాయి. విజేతలకు బహుమతులు మంగళవారం అందజేశారు. ముఖ్య అతిదులుగా జడ్పీటీసీ లోలాక్షి, ఎం ఈ ఓ శివరాం ప్రసాద్ పాల్గొని మాట్లాడారు.

**బోరివంక ప్రధమ స్థానం :**

పోటీల్లో కవిటి మండలం బోరివంక విద్యార్థుల జట్టు విజేతగా నిలిచి పదివేలు రూపాయలు, మెమెంటో, బంగారు పతకం అందుకున్నారు.కాశీబుగ్గ శ్రీ కృష్ణ సాహితీ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి ఏడు వేల రూపాయలు నగదు, షీల్డ్, వెండి పతకం అందుకున్నారు. ఎర్రముక్కం విద్యార్థులు మూడో స్థానంలో నిలిచి ఐదు వేల రూపాయలు నగదు, కాంశ్య పతకం అందుకున్నారు. లోహరీబంద విద్యార్థులు నాల్గో స్థానంలో నిలిచారు. ఉపాద్యాయుడు మడ్డు తిరుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో టెనెక్ట్ ప్లస్



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22 (వార్త):** ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రి లో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి అకస్మాత్తుగా సంభవించే హార్ట్ ఎటాక్ వచ్చిన రోగులకు సత్వరమే వైద్యం అందించి ప్రాణాపాయ స్తితి నుండి విముక్తి కలిగించే టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ ఇచ్ఛాపురం సామాజిక హాస్పిటల్ యందు అన్నివేళలా అందుబాటులో ఉంటుందని చెప్పారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైద్యవిధాన్ పరిషత్ ఆధ్వర్యంలో ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని సుమారుగా ఈ ఇంజెక్షన్ 40 నుండి 50 వేలు రూపాయలు వరకు ఉంటుందని చెప్పారు .ఈ ఇంజెక్షన్ వేసే ముందుగా ఈ సి జి , కొలెస్ట్రాల్ టెస్ట్, ఎకోస్ప్రిన్ టాబ్లెట్ ఇస్తూ బి పి మానిటరీ చేస్తూ హెపారిన్ ఇంజెక్షన్ వేస్తూ మిగతా వైద్య బృందం పర్యవేక్షణలో టెనెక్ట్ ప్లస్ ఇంజెక్షన్ చేయడం జరుగుతుందని అన్నారు. నియోజకవర్గ ప్రజలు మున్సిపాలిటీ ప్రజలు సమీప గ్రామాలప్రజలు ఈ సదవకాశం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా హాస్పిటల్ సూపరిండెంట్ దేవేంద్ర రెడ్డి ఈ సందర్భంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ సమీరా,తులసి, ఈశ్వరి వైద్య సిబ్బంది వైద్యులు పాల్గొన్నారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మామిడి

**పాతపట్నం, సెప్టెంబరు 22 (వార్త):** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున పాతపట్నం నియోజకవర్గ ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు పిలుపునిచ్చారు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికల నేపథ్యంలో అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రజలు అనవసరంగా ప్రయాణాలు చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, కాలువల సమీపంలో నివసించే ప్రజలు అధికారులు సూచించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. గాలుల ధాటికి కూలిపోయే ప్రమాదం ఉన్న పాత భవనాలు, బలహీనమైన నిర్మాణాలు, విద్యుత్ స్తంభాలు, ప్రకటనల హోర్డింగుల కింద, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్ల వద్ద ఎట్టి పరిస్థితుల్లోనూ సంచరించవద్దని సూచించారు. రెవెన్యూ, పోలీస్, విద్యుత్, విపత్తు నిర్వహణ శాఖలు జారీ చేసే అధికారిక సమాచారాన్ని మాత్రమే గమనించాలని, ఏదైనా అత్యవసర సహాయం లేదా సమాచారం కోసం తమ కార్యాలయ నెంబర్లను 63030 45925, 89858 08888, 80087 15770 సంప్రదించాలన్నారు.



## సమస్యలపై గళమెత్తిన ఎంపీపీ దేవదాస్

**కంచిలి, సెప్టెంబరు 22 (వార్త):** జిల్లా పరిషత్ మందిరంలో మంగళవారం ఛైర్పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశంలో కంచిలి ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి కంచిలి, సోంపేట మండలాల సమస్యలపై గలమెత్తారు. గత ఏప్రిల్ నేలలో కురిసిన అకాల వర్షాలకు జె నారాయణ పురం, జింకిభద్ర, బెంకిలి, పలాసపురం గ్రామాల్లో దెబ్బతిన్న టమాట పంటకు ఇప్పటికి పరిహారం అందించలేదని ఆవేదన వ్యక్తం జేశారు.అధికారులు పర్యటించి అంచనాలు వేసి జాబితాలు రూపొందించినప్పటికి పైసా పరిహారం అందించకపోవడం దురదృష్టం అని వాపోయారు. 2023 లో కంచిలి మండలం లో వరిపంట నష్టం వాటిల్లి వేలాది మంది రైతులు నష్టపోయిన దానికి కూడా పరిహారం ఇంతవరకు లేదని వాపోయారు. ఈ ప్రభుత్వం రైతులకు ఏమాత్రం సహాయం చేసే పరిస్థితి లేదని విమర్శించారు. అర్హులైన పింఛన్ దారులకు దరఖాస్తు చేసుకునేందుకు మరికొంత అవకాశం ఇవ్వాలని కోరారు. దీనిపై మరికొంత గడువు పెంచే అవకాశం ఉందని డి ఆర్ డి ఏ పీడీ తెలిపినట్లు ఎంపీపీ పేర్కొన్నారు.





## భారీ వర్షాల నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**- పారిశుధ్య, కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఈవో ఆదేశం**

**- రహదారులపై నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలి**

**- మురుగు కాలువలు నిండితే తక్షణమే శుభ్రం చేయాలి**

**నరసన్నపేట, సెప్టెంబరు 22 (వార్త):** భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నరసన్నపేట మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈవో పి.జగన్ మోహన్‌రావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య, కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యంగా ప్రధాన రహదారులు, కాలనీల్లో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి సమస్య తీవ్రతరం కాకముందే పరిష్కరించాలని సూచించారు. మురుగు కాలువలు వర్షపు నీటితో నిండిపోయినా, చెత్తాచెదారం పేరుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడినా పారిశుధ్య సిబ్బంది వెంటనే సంబంధిత ప్రాంతానికి చేరుకుని కాలువలను శుభ్రం చేయాలని ఆదేశించారు. వర్షాల సమయంలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా కార్యాలయ సిబ్బంది కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ప్రజలకు అత్యవసర సమయంలో సేవలు అందించేందుకు సిబ్బంది అందుబాటులో ఉండాలని ఈవో సూచించారు. వర్షాల ప్రభావంతో ఏర్పడే సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కరించేలా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

## మాకివలస బట్టి శుభ్రతకు చర్యలు

**- భారీ వర్షాలతో నిండిన బట్టికి మరమ్మతు, శుభ్రత పనులు**

**- పంట పొలాల్లోకి నీరు చేరకుండా రైతుల ముందస్తు చర్యలు**

**- బట్టి నీటితో మూడు చెరువులు నింపేందుకు ప్రణాళిక**



**నరసన్నపేట, సెప్టెంబరు 22 (వార్త):** మాకివలస గ్రామంలో భారీ వర్షాలకు మాకివలస బట్టి పూర్తిగా నిండడంతో పంట పొలాల్లోకి నీరు చేరే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు అప్రమత్తమై బట్టి నుంచి నీటి ప్రవాహాన్ని సక్రమంగా మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. మంగళవారం నీటి సంఘం అధ్యక్షుడు సిమ్మ చంద్రరావు, మాజీ సర్పంచ్ యాల వేణుగోపాలరావు సహకారంతో సుమారు 500 మీటర్ల మేర బట్టిని శుభ్రం చేశారు. బట్టిలో పేరుకుపోయిన మట్టి, ఇతర వ్యర్థాలను తొలగించి నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బట్టికి ఆనుకుని మూడు చెరువులు ఉన్నాయని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న వర్షపు నీటిని వృథాగా పంట పొలాల్లోకి వెళ్లకుండా చెరువులకు మళ్లించి వాటిని నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. చెరువులు నిండితే రానున్న సాగు అవసరాలకు నీటి లభ్యత మెరుగుపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చోట్ల బట్టి శుభ్రత పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

## బుడితిలో ఘనంగా అన్నదానం

**- భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేసిన ధర్మాన తేజ్‌కుమార్**



**సారవకోట, సెప్టెంబరు 22 (వార్త):** బుడితి గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి, సారవకోట మండల తెలుగుదేశం పార్టీ రథసారథి ధర్మాన తేజ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో భక్తులు, గ్రామస్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ధర్మాన తేజ్‌కుమార్ భక్తులకు అన్నప్రసాదం అందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనడంతో భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బుడితి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సారవకోట రామారావు, సారవకోట మండల తెలుగు యువత అధ్యక్షుడు పిల్లా నందకిషోర్‌తో పాటు బుడితి గ్రామ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామంలో వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు స్థానికులు సహకరించారు.

## అర్హులైన బాధితులకు త్వరితగతిన సాయం

**- సీఎం సహాయనిధి కోసం బాధితుల నుంచి వినతుల స్వీకరణ**

**- ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వారికి అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ**

**- వినతులను పరిశీలించి అమరావతికి పంపిస్తామని వెల్లడి**



**పోలాకి, సెప్టెంబరు 22 (వార్త):** కత్తిరివానిపేట క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజాదర్బారులో పలువురు బాధితులు తమ సమస్యలపై వినతులు సమర్పించారు. ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ వచ్చిన అర్జీలను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన స్వీకరించారు. పోలాకి మండలం ఉరజాం గ్రామానికి చెందిన పాలకొండ వెంకటేష్, నరసన్నపేట మండలం కరగాం గ్రామానికి చెందిన పంగ లక్ష్మణమూర్తి తమ ఆరోగ్య, అత్యవసర పరిస్థితులను వివరించి సీఎం సహాయనిధి మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారు. బాధితులతో మాట్లాడిన ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకుని, ఆర్థిక ఇబ్బందుల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన బాధితులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన వినతులను పరిశీలించి, సత్వర పరిష్కారం కోసం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి క్యాంప్ కార్యాలయం నిరంతరం అందుబాటులో ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అర్హత కలిగిన బాధితులకు ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. దీంతో తమ సమస్యలను ప్రజాదర్బారులో నేరుగా తెలియజేసే అవకాశం లభించిందని బాధితులు పేర్కొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయానికి సమష్టిగా పనిచేయాలి

**-ఇచ్ఛాపురంలో కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశం**

**- స్థానిక ఎన్నికల్లో ప్రతి స్థాయిలో కాంగ్రెస్ అభ్యర్థులను బరిలో నిలపాలని నిర్ణయం**

**-మండలాలు, మున్సిపాలిటీ వార్డుల్లో అభ్యర్థుల ఎంపికపై దృష్టి**

**- డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులకు నియామక పత్రాల అందజేత**



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 22 (వార్త):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సనపల అన్నాజీ రావు పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం నియోజకవర్గ కోఆర్డినేటర్ మాసుపత్రి చక్రవర్తి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన డీసీసీ అధ్యక్షుడు అన్నాజీ రావు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ సర్పంచ్ స్థాయి నుంచి జడ్పీటీసీ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున అభ్యర్థులను పోటీలో నిలిపేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని ప్రతి వార్డులోనూ పార్టీ తరఫున అభ్యర్థులను బరిలో నిలిపేందుకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. స్థానికంగా పార్టీకి సంబంధించిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతూ ఎన్నికల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా డీసీసీ కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు నియామక పత్రాలను అందజేశారు. పార్టీ సంస్థాగత కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంతో పాటు మండల స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కోత మధుసూదన్‌రావు, డీసీసీ కార్యదర్శులు అలీఖాన్, పూడి కిరణ్‌కుమార్, ఇచ్ఛాపురం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొయ్య పాపారావు, కవిటి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పనపాన మధు, కంచిలి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాసుపత్రి తులసీదాస్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546